పలుచోట్ల అభయ రక్షక దళం గస్తీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో అభయ రక్షక దళం గస్తీ నిర్వహించి పలు అవగాహనా కార్యక్రమాలను చేపట్టారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం అభయ రక్షక దళం గస్తీ నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రాంతాలు, కళాశాల ప్రాంగణాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అభయ రక్షక దళ సిబ్బంది మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే 9555035100 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించాలని చెప్పారు. ఎవరైనా ఆపదలో ఉన్నట్లు తెలిస్తే వెంటనే అభయ రక్షక దళానికి సమాచారం ఇవ్వాలన్నారు. 112 నెంబర్‌కు సమాచారం ఇస్తే వెంటనే సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుంటారని తెలిపారు. ముఖ్యంగా కళాశాల ప్రాంగణాల్లో ఎవరైనా విద్యార్థులు వేధింపులకు గురైతే వెంటనే వారు మహిళా

ఎస్‌సి ఉప వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ వినతుల స్వీకరణ

జిల్లా అధికారులతో కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా ప్రత్యేక సమావేశం

సమాచారం అందజేతపై కచ్చితమైన ఆదేశాలు జారీ

వివిధ సంఘాల నుంచి 132 వినతులు స్వీకరణ

భారీ పోలీస్ బందోబస్తు నడుమ సాగిన ప్రక్రియ

మాట్లాడుతున్న ఏకసభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రా ఏకసభ్య కమిషన్ శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్వాగతం పలికి పూలమొక్కలను అందజేశారు. తొలుత ఎస్‌సి ఉప కులాల వర్గీకరణకు సంబంధించి అధికారులతో కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన షెడ్యూల్డ్ కులాలవారీగా వివరాలపై మాట్లాడాలన్నారు. దీంతో తొలుత జెడ్‌పి సిఇఒ సుబ్బారావు మాట్లాడారు. జిల్లాలో ఎంతమంది జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలు ఉన్నారు, అందులో షెడ్యూల్డ్ కులాలవారీ వివరాలను తెలిపారు. ఆ తర్వాత పంచాయతీ, విద్యాశాఖ, డిఆర్‌డిఎ, ఇండస్ట్రీయల్ డిపార్ట్‌మెంట్, ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు సంబంధించిన అధికారులతోపాటు ఇతర అధికారులు ఆయా శాఖలవారీగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలతోపాటు ఇతర అంశాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి ఆయా శాఖలవారీగా పూర్తి సమాచారాన్ని వెంటనే కమిషన్‌కు సమర్పించాలని చైర్మన్ ఆదేశించారు. దీనిపై జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆయన సూచించారు. జిల్లాలోని ఆయా శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఉప కులాలవారీగా సమాచారం అందించాలన్నారు. సమావేశంలో కలెక్టర్, ఎస్‌పితోపాటు డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

132 వినతుల స్వీకరణ

జిల్లా అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ వినతులు, అభ్యంతరాలను స్వీకరించారు. మొత్తం 132 వినతులు కమిషన్‌కు అందాయి. సుమారు 600 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందితో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగులు, న్యాయవాదులు వినతులు అందించిన వారిలో ఉన్నారు. వినతులు స్వీకరణతోపాటు వారి అభిప్రాయాలు సైతం కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా విన్నారు. వీటిని పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు. ఇంకా ఏమైనా వినతులు ఉంటే విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌కు అందించవచ్చునని తెలిపారు.

ఆస్తి కోసమే డెడ్‌బాడీ డోర్ డెలివరీ

ముగ్గురు అరెస్టు , కోర్టుకు నిందితులు, రిమాండ్

జిల్లా ఎస్‌పి నయీం అస్మి

నిందితులను మీడియాకు చూపుతూ మాట్లాడుతున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసమే ఒక అమాయకుడిని హత్య చేసి, ఆ మృతదేహాన్ని డోర్‌డెలివరీ చేసినట్లు పోలీసులు నిర్ధారించి ముగ్గురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలను భీమవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి వెల్లడించారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మల్లంపూడికి చెందిన తిరుమాని శ్రీధర్ తన పేరును చేకూరి శ్రీధర్ వర్మ, సిద్ధార్థ వర్మ అనే పేర్లతో మండల కేంద్రం కాళ్లలోని గాంధీనగరంలో నివాసం ఉన్నాడు. శ్రీధర్ 2010లో కాళ్ల మండలం ఇస్కులంకకు చెందిన చిప్పల రాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన విజయవాడకు చెందిన వివాహిత పెన్మెత్స సుష్మను కాళ్ల తీసుకొచ్చి అద్దె ఇంట్లో ఉంచి సహజీవనం చేస్తున్నాడు. అప్పటికే ముదునూరి రేవతిని ప్రేమ పెళ్లి చేసుకుని గాంధీనగరంలో ఉంచాడు. సుష్మను బంధువుగా రేవతికి పరిచయం చేసి ఆమెను గాంధీనగరంలో ఉంచాడు. ఉండి మండలం యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, హైమావతి దంపతులకు తులసి పెద్ద కుమార్తె. రెండో కుమార్తె శ్రీధర్‌వర్మ రెండో భార్య రేవతి. తులసికి నిడదవోలుకు చెందిన సుబ్బరాజుకు ఇచ్చి వివాహం చేసి అరెకరం పొలం రాశారు. తులసి భర్త ఇల్లు విడిచి వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. అయితే కుటుంబంలో విభేధాలతో పాలకోడేరు మండలం గరగపర్రులో అద్దె ఇంట్లో తన కుమార్తెతో కలిసి ఉంటోంది. రేవతికి కూడా తల్లిదండ్రులు 50 సెంట్లు ఇవ్వగా మిగిలిన ఎకరం 43 సెంట్ల పొలం తండ్రి రంగరాజు పేరున, ఇల్లు తల్లి హైమావతి పేరున ఉంది. తమ తదనంతరం ఆస్తిని ఇద్దరు కుమార్తెలకు సమానంగా పంచుతామని తల్లిదండ్రులు చెప్పడంతో మొత్తం ఆస్తిని ఎలాగైనా కాజేయాలని శ్రీధర్‌వర్మ రెండో భార్య రేవతితో కలిసి కుట్ర పన్నాడు. యండగండిలో జగనన్న కాలనీలో కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రాజమండ్రి క్షత్రియ ఫౌండేషన్ నుంచి గత సెప్టెంబర్ 11, 21 తేదీల్లో ఒక ఆటోలో పెయింట్ డబ్బాలు, టైల్స్ వచ్చాయి. ఫౌండేషన్ తరపున సాయంగా వీటిని పంపుతున్నట్లు శ్రీధర్‌వర్మ తులసికి ఫోన్ చేయించాడు. ఈ నెల 19న సాయంత్రం ఐదు గంటలకు ఒక ట్రక్కు ఆటోలో చెక్కపెట్టెలో ఎలక్ట్రికల్ సామగ్రి పేరిట డెడ్‌బాడీని తులసి తండ్రి ముదునూరి రంగరాజు ఇంటికి పంపి, ముందుగానే తులసికి సమాచారం ఇచ్చారు. పెట్టె తెరవగానే మృతదేహం చూసి కంగారు పడుతున్న తులసికి, పక్కనున్న లెటర్ చదివి విన్పించి మృతదేహాన్ని మాయం చేయడానికి ఆస్తి తన పేరిట రాయాలని, అలాగైతే ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటానని బెదిరించాడు. అయితే తులసి చాకచాక్యంగా బంధువుల ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో శ్రీధర్‌వర్మ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్‌పి 11 బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా శ్రీధర్‌వర్మ వద్దకు పనికి వచ్చే బర్రె పర్లయ్య ఒంటరిగా జీవిస్తున్నాడని గుర్తించి పని పేరిట మద్యం పోయించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీ రాత్రి శ్రీధర్‌వర్మ, సుష్మ పర్లయ్యకు మద్యం ఇప్పిస్తామని చెప్పి కారు ఎక్కించుకుని స్పృహలో లేని స్థితి వరకూ మద్యం తాగించారు. అనంతరం పర్లయ్యను వాండ్రం గ్రామంలో పొలాల వైపు తీసుకొచ్చి వెనుక సీట్లో ఉంచి మెడకు వైరు బిగించి శ్రీధర్‌వర్మ, సుష్మ కలిసి హత్య చేశారు. అనంతరం సుష్మను కోపల్లెలో దించేసి ఇస్కులంక వెళ్లిపోయాడు. మరుసటి రోజు కోపల్లె వచ్చి కారు అక్కడే వదిలి కైకలూరు వెళ్లి చెక్క పెట్టె తయారు చేయించారు. కాళ్లకూరు రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పర్లయ్య మృతదేహాన్ని పెట్టెలోకి చేర్చి పార్శిల్‌గా తయారు చేశారు. అక్కడే రూ.1.30 కోట్లు ఇవ్వాలని అజ్ఞాత వ్యక్తి రాసినట్లుగా లేఖ సుష్మతో రాయించి దాన్ని పెట్టెకు అంటించారు. ఆ పెట్టెను కారులో పెట్టుకుని గాంధీనగరం చేరుకున్నారు. 19వ తేదీన శ్రీధర్‌వర్మ, సుష్మ కలిసి గణపవరం మండలం కేశవరం చేరుకున్నారు. అక్కడ పిప్పరకు చెందిన ఆటో మాట్లాడుకుని చెక్కపెట్టె పార్శిల్ యండగండిలో అందజేయాలని చెప్పారు. శ్రీధర్‌వర్మ వెంటనే రేవతికి ఫోన్ చేసి చెక్కపెట్టె వస్తున్న విషయం తెలిపి వెనుక కొద్దిసేపటికి తాను కూడా అక్కడికి చేరుకుని తులసిపై ఒత్తిడి తెచ్చి ఆస్తి రాయించుకునే ప్రయత్నం చేశాడు. పోలీసుల రాకతో అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ నెల 26న పోలీసులు శ్రీధర్ వర్మ, సుష్మను కానూరు డంపింగ్ యార్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. తర్వాత రేవతిని కూడా యండగండిలో ఆమె ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో ఎఎస్‌పి భీమారావు, భీమవరం డిఎస్‌పి జయసూర్య, ఆకివీడు సిఐ వి.జగదీశ్వరరావు, ఉండి ఎస్ఐ ఎమ్‌డి.నసీరుల్లా, కాళ్ల ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, ఆకివీడు ఎస్ఐ హెచ్.నాగరాజు పాల్గొన్నారు.

కోర్టుకు నిందితులు : రిమాండ్ విధింపు

ఉండి: అత్త మామలను, వదినను బెదిరించి ఆస్తి కాజేసేందుకు అమాయకుడిని హత్య చేసి ఆ డెడ్‌బాడీని పార్శిల్‌లో పంపిన కేసులో ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్ వర్మ, అతనికి సహకరించిన రెండో భార్య రేవతి, సహజీవనం చేస్తున్న సుష్మ (విజయలక్ష్మి)ను ఉండి పోలీసు స్టేషన్ నుంచి శుక్రవారం సాయంత్రం భీమవరంలోని కోర్టుకు తరలించారు. కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు ఉండి ఎస్ఐ మహ్మద్ నసీరుల్లా తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న సిసోడియా

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెవెన్యూ శాఖకు చెందిన సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా తెలిపారు. మండలంలోని పెదపాలపర్రులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేసి రైతులనుద్దేశించి మాట్లాడారు. దీర్ఘకాలంగా, అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. 22(ఎ)లో చేర్చిన భూములను చేర్చడం, తీసివేయడం గత ప్రభుత్వంలో జరిగిందన్నారు. రెవెన్యూపరమైన అంశాలు, భూముల వివాదాలకు సంబంధించి కోర్టు కేసుల్లో ఉంటే తామేమీ చేయలేమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ సమస్యలు ఉన్నందున వాటి యజమానులు పూర్తిస్థాయి హక్కులతో అనుభవించలేకపోతున్నట్లు తెలిపారు. ప్రధానంగా చుక్కల భూములు, 22(ఎ) భూముల వల్ల ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ భూములకు సంబంధించిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులకు సంబంధించిన అర్జీలను సభల్లో స్వీకరించే అవకాశం లేదన్నారు. ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉన్న భూసమస్యలను సిసోడియా దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా మండలంలోని వడాలి జగన్నాథస్వామి ఆలయ భూములు, వైవాక అసైన్డ్ భూములు, కలిదిండి మండలం భాస్కరరావుపేట, గుర్వాయిపాలెం, మండవల్లి మండలం ఉనికిలి గ్రామాల్లో ఉన్న భూసమస్యలను పరిష్కరించి సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చేలా చూడాలని సిసోడియాను కోరారు. దీనిపై స్పందించిన సిసోడియా మాట్లాడుతూ దేవాలయాల భూములకు సంబంధించి వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని చేయాల్సి ఉందన్నారు. ఇలాంటి వివాదాస్పద భూములు రాష్ట్రంలోని 25 జిల్లాల్లో 44 వేల ఎకరాల వరకు ఉన్నాయన్నారు. సదస్సులో భూసమస్యలు పరిష్కరించాలంటూ 23 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జెసి ధాత్రిరెడ్డి, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తహశీల్దార్ జెఎస్.సుభాని, ఆర్ఐ శామ్యూల్ రాజశేఖర్, సర్వేయర్ శీలం రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచి గంట రాకేష్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు శోభనాద్రి చౌదరి, ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కష్టారావు, కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం తగ్గించాలి

వైసిపి ఆధ్వర్యాన నిరసనలు



చింతలపూడిలో...

ఉంగుటూరులో....

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పెంచిన విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయం నుండి విద్యుత్ శాఖ ఇంజినీర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్ మోటార్ కనెక్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఇఇ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆర్.త్రివేణిదుర్గ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, జెడ్‌పి వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపిటిసి వరికూటి ప్రతాప్, నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీల అదనపు భారాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని వైసిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఆర్‌ఆర్‌పేటలోని విద్యుత్ భవనం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు గుడిదేశి శ్రీను, నూకపెయ్యి సుధీర్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి: విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా చింతలపూడిలో వైసిపి నేతలు ఆందోళన నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు నేతృత్వంలో వైసిపి శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టారు. తొలుత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఎడిఇకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతలు కేసరి సరితాభాస్కర్‌రెడ్డి, బొడ్డు వెంకటేశ్వరరావు, చిలుకూరి జానారెడ్డి, సాయిల స్వాతి, కెవిఎస్.రామకృష్ణ, జగ్గవరపు జానకిరెడ్డి, కొప్పుల నాగు, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: పోరుబాటలో భాగంగా వైసిపి శ్రేణులు నారాయణపురంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మాజీ ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతీయ రహదారి వద్దకు నాలుగు మండలాలకు చెందిన వైసిపి నేతలు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పాపారావుబాబ్జి, ఎంపిటిసి ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

విద్యుత్ భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ప్రధాన సెంటర్‌లో నిరసన తెలిపారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్‌ను ప్రయివేటుపరం చేయొద్దని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, అనుమోలు మురళి, మడకం కుమారి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో సోలార్ పవర్‌ప్లాంట్

స్థలాన్ని పరిశీలించిన ఎపిఇపిడిసిఎల్ సిఎండి ఇమ్మడి పృధ్వీతేజ్



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎపిఇపిడిసిఎల్ సిఎండి ఇమ్మడి పృధ్వీతేజ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ ద్వారకాతిరుమలలో ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యాన పైలెట్ సోలార్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్, సిఎండి ఇమ్మడి పృధ్వీతేజ్ తెలిపారు. ఆయన శుక్రవారం సంబంధిత ప్లాంట్ ఏర్పాటుకు నిర్దేశించిన స్థలాన్ని పరిశీలించారు. పర్యవేక్షక ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు, ఆపరేషన్ ఇఇ కెఎం.అంబేద్కర్, ఇతర విద్యుత్ అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా పృధ్వీతేజ్ మాట్లాడుతూ ప్రతి గృహ వినియోగదారుడు పిఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రభుత్వం వారు ఇచ్చే సబ్సిడీని వినియోగించుకుని సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుని కరెంట్ బిల్లులను తగ్గించుకోవాలన్నారు. అలాగే ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వాడుకోగా మిగిలిన దాన్ని ప్రభుత్వానికే విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పొందాలని కోరారు. సౌరశక్తిని వినియోగించి సోలార్ రూఫ్‌టాప్ ద్వారా భూమిపై కర్బన ఉద్గారాలను తగ్గించుకోవచ్చని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణ సదుపాయం పొందవచ్చునన్నారు.

నేడు, రేపు రెండో పిల్లల సంబరాలు

భీమవరం టౌన్: బాలల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి రెండేళ్లుగా వివిధ పాఠశాలల విద్యార్థులకు బాలోత్సవం నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ నెల 28, 29 తేదీల్లో భీమవరం డిఎన్ఆర్ విద్యాసంస్థలోని ఎస్‌సిహెచ్ బిఎఆర్ఎం హైస్కూల్లో రెండు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బాలోత్సవ నిర్వహణ కమిటీ కార్యదర్శి పట్టాభిరామయ్య తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో సన్నాహాల్లో భాగంగా అధికారులకు ఆహ్వాన పత్రాలను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా డిఇఒ ఇ.నారాయణరావు, చెరుకువాడ రంగసాయి, గాతల జేమ్స్ మాట్లాడుతూ బాలోత్సవాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభిస్తారని, ముగింపు రోజున ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఒ మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1500 మంది విద్యార్థులు పాల్గొంటారని, 16 అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఉత్తీర్ణతా శాతం పెంపే లక్ష్యం

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడమే లక్ష్యంగా జిల్లాలోని నిపుణులైన ఉపాధ్యాయులచే విజయకేతన పుస్తకాలను రూపొందించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో విజయకేతన పుస్తక ప్రారంభోత్సవాన్ని ఆమె శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ మాట్లాడుతూ ఈ విజయకేతన పుస్తకం ముఖ్యంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడం కోసం జిల్లాలో నిపుణులైన ఉపాధ్యాయులచే రూపొందించబడిందని తెలిపారు. గత సంవత్సరం కూడా ఈ పుస్తకం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పంపిణీ చేయడం వల్ల జిల్లాలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం బాగా పెరగడానికి కారణమైందన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా ఈ పుస్తకాలు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికతో తయారు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం సుమారు పాతిక వేల పుస్తకాలను పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. దీనిని ప్రతి విద్యార్థీ ఉపయోగించుకుని పంచ మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు డిఇఒ ఎం.వెంకటలక్ష్మి, భీమవరం డిఇఒ నారాయణ, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాడాలి

మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల జనరల్‌బాడీలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇ-చలానాల సమస్యల్లో దశలవారీ పోరాటాలను సాగించిన సిఐటియు శ్రేణులను ఆయన అభినందించారు. నేరస్తులను, నేరాలను అదుపు చేయడానికి వినియోగించాల్సిన సీసీ కెమెరాలను ఆటోలపై చలానాల విధించడానికి ఉపయోగించడం సరికాదని విమర్శించారు. ఏలూరులో పరిశ్రమలు మూతపడటంతో ఇతర ఉపాధి లేక యువత ఆటో డ్రైవర్లుగా, ఇతర రవాణా రంగ కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడాన్ని సిఐటియు స్వాగతిస్తుందని, అదే క్రమంలో జీవనోపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, ఇతర కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలని, రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కూ ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను అందించాలని కోరారు. ప్రభుత్వాలు మారినా ఆటో డ్రైవర్ల జీవన ప్రమాణాలు మారడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఆందోళన, పోరాటాలకు ఆటో కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతరం ఆటో యూనియన్ ఏలూరు టౌన్, రూరల్ నూతన కమిటీ ఎన్నికల్లో అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.రాజు, బి.చంద్రశేఖర్, కోశాధికారిగా ఎం.వీరభాస్కరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా పాపి నాయుడు, పాపారావు, ఆమోస్, సహాయ కార్యదర్శులుగా రమేష్, పండు, టి.ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.అమర్‌కుమార్, జె.గోపి ప్రకటించారు.

హిస్టరీ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి చరిత్ర (హిస్టరీ) అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ జరిగే మౌఖిక పరీక్షకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వి.విశ్వేశ్వరరావు తెలిపారు. కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా పని చేస్తున్న ఎం.ఎస్.కృష్ణజ్యోతి డిప్యూటేషన్‌పై రీసెర్చ్, పబ్లికేషన్ భాగంలో ఆర్కావ్ పదవికి వెళ్లారు. దీంతో ఏర్పడిన ఖాళీలో అతిథి ఉపన్యాసకులను నియమించబోతున్నామని, ఎంఏ హిస్టరీ సబ్జెక్టులో 55 మార్కులు ఆపై, బోధనా అనుభవం నెట్, స్లెట్, పిహెచ్‌డి డిగ్రీ తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

రిలయన్స్ ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రిలయన్స్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ జయంతి సందర్భంగా శుక్రవారం ఏలూరు ఆర్ఆర్.పేటలోని రిలయన్స్ సెంట్రల్ ప్లాజా వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 27 మంది రిలయన్స్ ఉద్యోగులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి ఎంతోమందికి ఉద్యోగావకాశాలు కల్పించిన ధీరూభాయ్ అంబానీ జయంతి సందర్భంగా ఉద్యోగులు రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ఆర్.కె.వరప్రసాదరావు, జియో సర్వీస్ సెంటర్ మేనేజర్ ఎ.వి.వెంకట్రావు, ఫ్రెష్ హెచ్ అబ్బాస్, రిలయన్స్ డిజిటల్ మేనేజర్ గోపీసింగ్, పిఆర్ఓ కె.వి.రమణ పాల్గొన్నారు.

మామిడిచెట్ల ఫలసాయం వేలం

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి మండలం ముత్యనవీడు గ్రామంలోని ప్రభుత్వ ఉద్యాన నర్సరీలో ఉన్న 105 మామిడి చెట్ల ఫలసాయం జనవరి రెండో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వేలం, టెండరు ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. టెండరు, వేలంలో పాల్గొనాలనుకున్న వారు వివరాల కోసం ఉద్యాన అధికారి 7995086873 సంప్రదించాలని తెలిపారు.

వీధి కుక్కల పట్టివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో వీధికుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రతి వీధిలో కుక్కలు బెడద ఎక్కువైంది. కుక్కలు గ్రామంలోని రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అంతేకాకుండా దారినపోయే ద్విచక్ర వాహనదారుల వెంట, సైకిల్‌పై వెళ్లే వారి వెంట పడుతున్నాయి. దీంతో కంగారులో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ఈ మధ్యకాలంలో కుక్క కాటులు కూడా ఎక్కువయ్యాయి. ద్విచక్ర వాహనదారులను, ప్రజలను కుక్కలు వెంటాడుతూ కాటు వేయడంతో కుక్క కాటుకు గురైన వ్యక్తులు ప్రభుత్వాసుపత్రి చుట్టూ తిరుగుతూ చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామస్తులు వీధి కుక్కలను నిర్మూలించాలని పంచాయతీకి ఫిర్యాదులు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మచిలీపట్నం నుంచి కుక్కల వేటగాళ్లను రప్పించారు. ఈ కుక్కల వేటగాళ్లు గ్రామంలోని తిరుగుతూ కుక్కలను పట్టుకుని వాహనంలో బంధిస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే వంద కుక్కలను పట్టుకున్నట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. పట్టుకున్న ఈ కుక్కలను ప్రభుత్వ ఆదేశాల మేరకు మచిలీపట్నం సమీపంలోని మడ అడవుల్లో విడిచిపెట్టనున్నట్లు తెలిపారు. ఈ కుక్కల వేట కార్యక్రమం గ్రామంలోని కుక్కలను పూర్తిగా పట్టుకునే వరకు కొనసాగనుంది.

వాహనంలో కుక్కలు

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా పడి కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాగుపాడులో వరి చేలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి కౌలు రైతు ఈపి శ్రీనివాసరావు (39) అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని కాగుపాడుకు చెందిన కౌలురైతు శ్రీనివాసరావు గ్రామంలో కొంత పొలాన్ని లీజుకు తీసుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పవర్ ట్రిల్లర్ సాయంతో దమ్ము చేస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దానికింద ఉన్న శ్రీనివాసరావు తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. మృతుడికి భార్య సరిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీనివాసరావు (ఫైల్)

తల్లి దినకర్మ జరిగిన మరుసటి రోజే కుమారుడి మృతితో విషాదఛాయలు

శ్రీనివాసరావు తల్లి ఈపి సావిత్రి అనారోగ్యంతో మృతిచెందగా ఈ నెల 26వ తేదీన కుటుంబసభ్యులు పెదకర్మను నిర్వహించారు. దశ దినకర్మ పూర్తికావడంతో శ్రీనివాసరావు శుక్రవారం పొలం పనులు ప్రారంభించి ప్రమాదవశాత్తు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కౌలు రైతు వ్యవసాయానికి వెళ్లి ప్రేమతో కష్టపడి చేసుకుంటున్నారని టిడిపి మాజీ మండలాధ్యక్షుడు కడియాల రవిశంకర్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి సాయం వచ్చేలా కృషి చేస్తామని రవిశంకర్ తెలిపారు.

నూజివీడులో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు కొనసాగుతున్నాయి. వరుస దొంగతనాలతో గత నాలుగు నెలలుగా పట్టణ వాసులకు కంటిమీదకునుకు లేకుండాపోతుంది. ఇప్పటి వరకు ఎస్పాయిగా కాలనీలో పరిమితమైన చోరీలు ఇప్పుడు బస్టాండ్ వరకు పాకాయి. తాజాగా గురువారం రాత్రి సమతానగర్‌లో రిటైర్డ్ తహశీల్దార్ సూరానేని జగన్నాధరావు ఇంట్లో చోరీ జరగడంతో ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. జగన్నాధరావు తన కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. దీంతో దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి జొరబడి బెడ్‌రూమ్‌లోని బీరువాలు పగలగొట్టి వస్తువులను, బట్టలను చెల్లాచెదురుగా పడేశారు. శుక్రవారం ఉదయాన్నే ఇంటిముందు ముగ్గు వేసేందుకు పనిమనిషి వచ్చి గేటు తాళం తీసి లోపలికి వెళ్లగా ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించింది. దీంతో వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారాన్ని తెలపగా వారు దొంగలు పడినట్లు జగన్నాధరావుకు ఫోన్‌లో సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పట్టణ సిఐ సత్య శ్రీనివాస్ దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంట్లో ఉన్న ఒక వెండి ప్లేటు, వెండి గ్లాసు మాత్రమే చోరీకి గురైనట్లు సిఐ తెలిపారు. ఏలూరు నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. విలువైన వస్తువులు ఉన్న ఒక బీరువా తలుపులు దొంగలు తెరవలేకపోయారు. బెంగుళూరు నుంచి శనివారం జగన్నాధరావు కుటుంబ సభ్యులు నూజివీడుకి చేరుకుంటారు. ఆయన వస్తేనే గాని ఇంట్లో ఏమేమి వస్తువులు పోయాయో, నగదు ఎంత పోయిందో వివరాలు తెలుస్తాయని సిఐ అన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా శుక్రవారం జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తెలంగాణ ప్రాంతంలోని అశ్వారావుపేట నుండి ఎ.పోలవరం గ్రామానికి ద్విచక్రవాహనం పై అక్రమంగా తరలిస్తున్న 150 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు సిఐ తెలిపారు. అదేవిధంగా దర్భగూడెం గ్రామంలో ఓ ఇంట్లో దాచి ఉంచిన తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనుబాబు తెలిపారు. వేర్వేరు దాడుల్లో భాగంగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 250 మద్యం బాటిళ్లను, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించినట్లు సిఐ శ్రీనుబాబు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజలకు 24 గంటటూ అందుబాటులో ఉంటా

ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తాను 24 గంటలూ అందుబాటులో ఉంటానని ముసునూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం.చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న: గతంలో ఏయే ప్రాంతాల్లో పనిచేశారు?

ఎస్ఐ: విసన్నపేట, నూజివీడు తదితర ప్రాంతాల్లో పని చేశాను. బదిలీపై ముసునూరు వచ్చాను.

ప్రశ్న : మండల పరిధిలోని ఏ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు?

ఎస్ఐ : మహిళలు, చిన్నపిల్లలపై జరిగే ఆకృత్యాల నివారణపై, జూదాలపై దృష్టి పెట్టాం. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాను. నాటుసారా నివారణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తాను.

ప్రశ్న : రాత్రి సమయాల్లో నేరాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : ప్రతిరోజు తమతో పాటు తమ సిబ్బంది కూడా గస్తీ నిర్వహిస్తుంది. అనుమానాస్పద పాత నిందితుల కదలికలపై నిఘా పెట్టాం. మండలంలో రెండు మూడు చోట్ల చోరీలు చోటు చేసుకున్నాయి. నిందితులను త్వరలో పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకుంటాం.

ప్రశ్న: మండలంలో ఎక్కువగా ఎటువంటి కేసులు నమోదవుతున్నాయి?

ఎస్ఐ : ఆస్తి, పొలం తగాదాలు, గట్టు తగాదాలు, భార్యాభర్తల గొడవలు, దొంగతనాలు, నాటు సారా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

ప్రశ్న : సైబర్ నేరాల గురించి ప్రజలకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?

ఎస్ఐ : అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్, మెసేజ్ సందేశాలకు స్పందించవద్దు. సైబర్ క్రైమ్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ప్రత్యేక చర్యలు చేపడతాం.

ప్రశ్న: నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భాల్లో కోడిపందేలు, పేకాట, జూదంపై మీరు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారా?

ఎస్ఐ : ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన గుండాట, పేకాట, జూదం, కోడిపందేలపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. చట్ట వ్యతిరేక పనులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : యువతకు మీరిచ్చే సందేశం ఏంటి?

ఎస్ఐ : గంజాయి, మాదకద్రవ్యాలు, జూదం వంటి వ్యసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలి. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం పోలీస్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌పి పాల్గొని సిబ్బంది నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు.

ఎంపిడిఒ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసే అధికారులకు తగిన గుర్తింపు ఉంటుందని, ఎంపిడిఒ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల పరిచయం మూడు తరాలు గుర్తుండిపోయేలా మండలాభివృద్ధికి అధికారులకు తగు సూచనలు అందించిన మహోన్నత వ్యక్తి ఎంపిడిఒ వెంకటేశ్వరరావు అని తెలిపారు. పని చేసిన మూడు నెలల్లోనే అన్ని శాఖల అధికారులకు అత్యంత ఆప్తునిగా ఉంటూ అందరి అభిమానాన్ని పొందిన వ్యక్తి వెంకటేశ్వరరావు అని అన్నారు. అనంతరం ఎంపిడిఒ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

లైబ్రరీ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు మృతి బాధాకరం

ప్రజాశక్తి - మండవల్లి

లైబ్రరీ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు మృతి బాధాకరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిరిస పాఠశాలలో లైబ్రరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగమల్లేశ్వరరావు ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో మే నెలలో మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో సహృదయంతో మెలుగుతూ విద్యార్థుల పట్ల నాగమల్లేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండేవారన్నారు. ఆయన మతి బాధాకరమన్నారు. నాగమల్లేశ్వరరావు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న విద్యార్థులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారని తెలిపారు. ప్రతిజ్ఞ సమయంలో విద్యార్థుల చేత ఆయన మృతికి సంతాపం నిర్వహించా మన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాగమల్లేశ్వరరావు (ఫైల్)

బిల్లులు పెండింగ్ లేకుండా చూడండి

ప్రజాశక్తి - ఉంగుటూరు

గోకులం షెడ్డుల నిర్మాణ పనులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఉంగుటూరు ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ అన్నారు. ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. షెడ్డులు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ నెల 31న ప్రజా దర్బార్‌లో గోకులం షెడ్డుల బిల్లులు కోసం ఎవరూ ఫిర్యాదు చేయని విధంగా సకాలంలో బిల్లులు ఆమోదం పొందేలా వ్యవహరించాలని ఎంపిడిఒ వివరించారు.

రైతులు ఇ-పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మొక్కజొన్న సాగు చేస్తున్న, ఇతర రకాల పంటలను పండిస్తున్న రైతులందరూ రైతు సేవా కేంద్రంలో ఇ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ తెలిపారు. మండల కేంద్రమైన చాట్రాయిలోని మొక్కజొన్న పైరును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండిస్తున్న పంటలను రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. గిట్టుబాటు ధర, పంట నష్టం, ఇన్సూరెన్స్, పంట రుణాలు, కౌలు రైతులకు కార్డులు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఈ రాయితీలను మండలంలోని రైతులందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

మన్మోహన్ సింగ్ అద్భుతమైన ఆర్థిక వేత్త

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఒక అద్భుతమైన ఆర్థిక వేత్త అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ పద్మశ్రీప్రసాద్ అన్నారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఆమె ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఒక అద్భుతమైన ఆర్థికవేత్త అని అన్నారు. ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. ఆయన మన దేశానికి చేసిన సేవలు, చూపిన దార్శనికత ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు.



నివాళులర్పిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

చింతలపూడి : ఆర్థిక మంత్రి, ప్రధానమంత్రిగా, ఒక ఆర్థిక వైద్యుడిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల అమలులో ప్రధాన పాత్ర పోషించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పూలమాల అర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక శాఖ అధిపతి డి.శంకర పోలయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యం

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం చంద్రబాబును, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుని చింతలపూడి నియోజకవర్గంలో 42 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. మండలంలో లయన్స్ క్లబ్ వద్ద శుక్రవారం నిరుద్యోగ యువతకు ఫైనల్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి చదువులు చదివి ఉద్యోగావకాశాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇంగ్లీష్ భాషలో పట్టు ఉండాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలని, మాట్లాడగలగాలని, పోటీతత్వంలో నిలదొక్కుకోవాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగం రావటానికి, అమెరికా వెళ్లడానికి కమ్యూనికేషన్ స్కిల్స్, మోటివేషన్ స్పిరిట్, ఆంగ్ల పరిజ్ఞానంపై అవగాహన ఉండాలని, మాట్లాడగలగాలని చెప్పారు. అందుకే తాను వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేసి కంపెనీలతో మంచి నైపుణ్యం ఉన్న వ్యక్తులను గుర్తించి ఆపై ఆన్‌లైన్ టెస్ట్ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు పాల్గొన్నారు.



యువతతో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - ముసునూరు

వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన డి.షణ్ముఖవెంకటసాయికి, ద్వితీయ స్థానం సాధించిన పి.నాగరాజుకు, తృతీయ స్థానం సాధించిన పి.షణ్ముఖప్రియాకు వరుసగా రూ.2500, 2000, 1500 నగదు బహుమతులను అందించారు. అదే పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న కెవి.నారాయణరావు మాస్టారు, భార్య దుర్గారాణిలు కలిసి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ మాట్లాడారు.

ఏలూరులో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని ఏలూరు నగరంలో ప్రజల వినోదం కోసం విజయశ్రీ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. స్థానిక శనివారపుపేట పాత తివాచి సెంటర్‌లో ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ట్రిపుల్ ఆర్ ముఖం ద్వారా ఏర్పాటు చేసిన విజయశ్రీ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఎంఎల్ఎ బడేటి చంటి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా కనివిని ఎరుగని రీతిలో ట్రిపుల్ ఆర్ ముఖద్వారం హంగులతో వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించే విధంగా ఈ ఎగ్జిబిషన్ ఉందన్నారు. పిల్లలకు, పెద్దలకు అధునాతన అమ్యూజ్మెంట్ అందించేందుకు బ్రేక్ డాన్స్, సోలంబో, కొలంబస్, క్రాస్ వీల్, జాయింట్ వీల్, పిల్లల కోసం ప్రత్యేకంగా బేబీ ట్రైన్, స్కార్పియో, మోటార్ సైకిల్, షూటింగ్ తదితర ఏర్పాట్లు చేయడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు పప్పుల అనిల్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మండవల్లి: స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుంటే అత్యధిక మార్కులు సాధించవచ్చని లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర యుటిఎఫ్ నాయకత్వం దాతల సహాయంతో తయారు చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను లోకుమూడి, లింగాల, పుట్లల చెరువు పాఠశాలలకు శుక్రవారం అందించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు ఎంత ముఖ్యమో స్టడీ మెటీరియల్ కూడా అంతే ముఖ్యమన్నారు. గతంలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడానికి దిన పత్రికల్లో వచ్చిన మోడల్ పేపర్లను లేదా మోడల్ పేపర్లకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేసేవారన్నారు. విద్యపై ఉన్న మక్కువతో పదో తరగతిలో ప్రతి విద్యార్థి అధిక మార్కులు సాధించాలనే సంకల్పంతో స్టడీ మెటీరియల్ యుటిఎఫ్ శాఖ తయారుచేసి అందించడం అభినందనీయమన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లింగాల పాఠశాలకు 27 పుస్తకాలు, పుట్ల చెరువు పాఠశాలకు 15 పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమం లో యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. పిచ్చోడు, మేడా శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కె.ఆనంద కుమార్, యుటిఎఫ్ మండవల్లి కమిటీ ఎండి సోఫియా, ఆశీర్వా దం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాకా శ్రీనివాసరావు, ఎవి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'వర్గీకరణ పేరుతో ఎస్‌సిలను విడదీయడం సరికాదు'

ప్రజాశక్తి - పోలవరం

వర్గీకరణ పేరుతో ఎస్‌సిలను విడదీయ్యడం సరైన విధానం కాదని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొబ్బన మోహన్ అన్నారు. షెడ్యూల్ సామాజిక తరగతుల ఉప వర్గీకరణ, అమలు కమిటీ వన్‌మ్యాన్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజాన్ మిశ్రాకు వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రం అందించినట్లు సొబ్బన మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల్లో ఉన్న 15 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వాలు భర్తీ చేయడంలేదని, ఇంకా వర్గీకరణ అవసరం ఏముందని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ఉల్లఘించకుండా కమిషన్ తన నివేదిక తయారు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బచ్చల వెంకటరమణ, కుంజం నాగబాబు, దోర్నాల గంగాధర్, పెంటపాటి శ్రీను, కొండే యేసు ఉన్నారు.

టి.నరసాపురం : ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ మాల మాలమహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతిపత్రం అందించినట్లు మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్‌సి వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన కమిషన్ కమిటీ మాలలకు న్యాయం చేయాలని కోరారు.

వికలాంగుల చట్టంపై అవగాహనా సదస్సు

దెందులూరు: ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు శుక్రవారం ఎస్‌పిడిబిటి జూనియర్ కళాశాలలో 2016 వికలాంగుల హక్కుల చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌విఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ వైకల్య నివారణ కోసం ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైకల్యం ముందుగా గుర్తించడం, వైకల్యం వచ్చిన తర్వాత దానిని ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయాలను తెలిపారు. 18 ఏళ్ల లోపు వివాహాలు చేయరాదన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వికలాంగులను 21 రకాలుగా గుర్తించారని, ప్రభుత్వం వికలాంగులకు అందించే హక్కులను వివరించారు. సంస్థ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిడిఆర్‌సి కేంద్రం ద్వారా క్యాంపులు నిర్వహించి వికలాంగుల గుర్తింపునకు సర్వేలు చేయటం, జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ, ఆడియోలాజి, సైకలాజి సేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 08812-49297, 7386565469 సంప్రదించాలని కోరారు.

పాలకొల్లు పురపాలక సంఘం
ఆర్.ఓ.సి.నెం.592/2024/ఇ2
మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు, ది.27-12-2024
ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘం పరిధి 10వ వార్డు G+1 కాలనీ, చాత్రాయిచెరువు గట్టు, రాజీవ్ నగర్, బ్రహ్మానందరెడ్డి కాలనీ మరియు TIDCO ఇల్లులు ఉన్న ప్రాంతాలతోను మరియు నీటి ఎద్దడి ప్రాంతాలకు అద్దె వాటర్ ద్వారా మంచి నీటి సరఫరా అందించుటకు, పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలో గల 27వ వార్డులోని FCI గోడౌన్ నుండి క్షత్రియ కళ్యాణ మండపం వరకు RCC డ్రైన్ వేయు నిమిత్తం, పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని 20వ వార్డు నందు గల గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం నందు పి.సి.సి.తో స్టోన్ డస్ట్ ఫిల్లింగ్ చేసి పాండు (కొలను) ను రెయిజ్ చేయుటకు (3 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ.32,80,000/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెట్ నందు ది.28-12-2024వ తేది సాయంత్రం గం॥04-00 ని॥ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘం, పాలకొల్లు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ముసునూరు

రైతుల భూ సమస్యలను ఆయా గ్రామ పరిధిలోనే పరిష్కరించే విధంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జిపి.శర్మ తెలిపారు. మండలంలోని చెక్కపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అర్జీలు అందించారు. విఆర్ఒలు ఎన్.మస్తాన్‌రావు, సిహెచ్.రవికాంత్, టి.యశోద, విజయకుమారి, హరి బాబు, హనీబాబు, మణీంద్ర, ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వై.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో ఆయా శాఖలపై సమీక్ష ఉంటుందని, అధికారులు పూర్తి సమగ్ర నివేదికతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అలాగే అన్ని గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మిర్చి తోటల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గుళ్లపూడి, వలసపల్లి గ్రామాల్లో మిర్చి తోటలను ఉద్యాన అధికారిణి కె.జ్యోతిప్రియాంక క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొబ్బర తెగులు ఆశించకుండా మిర్చి రైతులు ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట మార్పిడి చేపట్టాలని, పచ్చి రొట్ట ఎరువులను పూత దశలో జూన్ మాసాల్లో వేసుకుని కలియ దున్నాలన్నారు. నారు దశలో ఇమిడి క్లోరోపస్‌ను పిచికారీ చేయాలన్నారు. ఆశించిన తెగులు నివారణకు పూత సమయాల్లో కచ్చితంగా సుష్మ పోషకాలు, క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ముందస్తుగా జిగురు అట్టలను ఎకరానికి పది అట్టలు అమర్చాలని సూచించారు. బంతి మొక్కలను కంచె పంటగా వేసుకోవాలని సూచించారు.

ప్రకటన

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారు మా కస్టమర్స్ అయినటువంటి 1. శ్రీ నాలి దుర్గారావు S/o.అప్పారావు, 2. శ్రీమతి నాలి ఉమామహేశ్వరి W/o.దుర్గారావు గార్లకు విజ్ఞప్తి చేయునదేమనగా మీరు మా కంపెనీ నందు లోన్ A/c.No.AP/RAJ/THRD/A000000365 గా తీసుకున్న ఋణం పూర్తిగా చెల్లించి నందున మీరు మాకు హామీగా ఇచ్చినటువంటి ఒరిజినల్ దస్తావేజులను రాజమండ్రి లోని మా బ్రాంచ్ వద్ద నుండి తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. లేని యెడల సదరు దస్తావేజులను మీచే 12-09-2024 తేదీన రిజిస్టర్డ్ క్రయదస్తావేజు (11233/2024) గా క్రయం పొందిన శ్రీ నౌడు గోపాలకృష్ణ గారికి యిచ్చుటకు నిర్ణయించడమైనది,కావున ఈ విషయంమై మీకు ఎట్టి అభ్యంతరములున్న నేటి నుండి 7 రోజుల లోపు మీరు తెలియజేయగలరు. లేని యెడల ఇది మీ సమ్మతిగా భావించి తగిన హామీ తీసుకొని సదరు దస్తావేజులను నౌడు గోపాలకృష్ణ గారికి అందజేయబడును.

మేనేజర్
హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రాజమండ్రి, 7075767491

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE CUM 2nd ADDITIONAL JUDICIAL 1st CLASS MAGISTRATE : TANUKU
O.S.No.744/2022
Between :
Mangina Srinivasa Rao ...Plaintiff
And
Naragani Veera Swamy ...Defendant
DEFENDANT :
Naragani Veera Swamy, S/o Pulayya, D.No.12-96/1, Relangi Village, Iragavaram Mandal, Tanunu. **...JCJC.**
ప్రకటన

పై నెంబరు గ్రంధములోని వాది మీ పై ఫైలిపిన శ్రీ కోర్టులో ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా సమనులు శ్రీకోర్టు వారి ద్వారా మీకు ఎన్ని సార్లు పంపినను మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కాబట్టి శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా వాయిదా తెలియచేచడమైనది. సదరు దావా **వాయిదా ది.10.01.2025 తేదీన** అయి ఉన్నది. కాబట్టి ఈ దావా విషయములో మీకు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నయెడల **ది.10.01.2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షములో శ్రీకోర్టు వారు తీర్పు చెప్పదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

వి.వి. సత్యసాయి
అడ్వకేట్, తణుకు.
తణుకు
ది.27.12.2024
సెల్ : 77801 54649

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం.185/22లో
ఓ.యస్.నెం.201/2015

పిటీషనర్/వాది: సానబోయిన సత్యనారాయణ
రెస్పాండెంటు/ప్రతివాదులు :
పాలా పద్మనాగమణి వగైరా
6వ రెస్పాండెంటు : జుత్తిగ విజయలక్ష్మి, భర్త నాట్‌నోన్, డోర్‌నెం.2-139, తోకలపూడిపాలెం, తోకలపూడి శివారు, వీరవాసరం మండలం, భీమవరం JCJCJ.
7వ రెస్పాండెంటు : గుత్తుల లక్ష్మీకుమారి, భర్త నాట్‌నోన్, డోర్‌నెం.2-139, తోకలపూడిపాలెం, తోకలపూడి శివారు, వీరవాసరం మండలం, భీమవరం JCJCJ.
8వ రెస్పాండెంటు : వీరవల్లి నాగరాజు, తండ్రి నాగసత్యనారాయణ, డోర్‌నెం.2-139, తోకలపూడిపాలెం, తోకలపూడి శివారు, వీరవాసరం మండలం, భీమవరం JCJCJ.

పిటీషనరు తరపున ప్రకటన

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన వీరవల్లి జానకీరత్నం అనే జానకమ్మ అనే ధనలక్ష్మి చనిపోయినందున 6 టు 8 వారలను ప్రతివాదులుగా చేర్పించవలసినదిగా కోరుతూ పిటీషను దాఖలు చేసినందున మీకు నోటీసు పంపినా అమలు జరుగని కారణంగా కోర్టు వారు Substitute Service ద్వారా నోటీసు అమలుకు ఉత్తర్వులు వేసినందున ది.**20-01-2025**వ తేదీని మీరు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లుకాని ఎడల మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి ముందు గ్రంథం జరిపించబడును.

//శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము//

కె.యస్.యల్.యన్.ప్రసాద్
అడ్వకేటు, తణుకు.
సెల్: 9848142794